## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386    85220 22029**

**Land Line No : 08517 224194**



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



తెలంగాణ - శ్రీ ప్రస్థానం



Call : 8522022029, 9491628386



కర్నూలు సంపుటి : 03 సంచిక : 345 | శుక్రవారం 15-03-2024 | పేజీలు :04 వెల:రూ.2.00


# రాష్ట్ర బిజెపికి మరో షాక్



## సిఎం రేవంత్‌తో జితేందర్ రెడ్డి భేటీ
### కాంగ్రెస్‌లో చేరేందుకు మాజీ ఎంపి ఆసక్తి
### బిజెపి టిక్కెట్ నిరాకరణతో పార్టీ మారేందుకు నిర్ణయం

హైదరాబాద్,మార్చి14 : రాష్ట్ర బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. ఎంపీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో జితేందర్ గురువారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చర్చలు జరిపిన అనంతరం కాంగ్రెస్‌లోకి రావడానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారు. బీజేపీ నుంచి మహబూబ్ నగర్ ఎంపీ టికెట్ ఆశించిన జితేందర్ రెడ్డికి షాక్‌నిస్తూ ఆ టికెట్‌ని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు కేటాయించారు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన జితేందర్ కాంగ్రెస్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి సీఎం నివాసానికి వెళ్లిన రేవంత్ రెడ్డిని కలిశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డిలు ఆయను సీఎం నివాసానికి తీసుకెళ్లారు. మహబూబ్ నగర్ ఎంపీ సీటును బీజేపీ హైకమండ్.. డీకె అరుణకు కేటాయించడంతో జితేందర్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు తెలంగాణలో రాజకీయ నాయకులు ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి జంప్ అవుతున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు.. కేసీఆర్ కు షాకిస్తూ ఇతర పార్టీల్లోకి జంప్ అవుతున్నారు. మరోవైపు, బీజేపీ.. రాష్ట్రంలో మెజార్టీ ఎంపీలు గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా పలువురు బలమైన బీఆర్ఎస్ అభ్యర్థులను పార్టీలో చేర్చుకుని ఎంపీ టికెట్లను కేటాయించింది. ఈ క్రమంలో మాజీ ఎంపీ , సీనియర్ బీజేపీ నేత జితేందర్ రెడ్డికి టిక్కెట్ నిరాకరించారు. మహబూబ్ నగర్ టిక్కెట్‌ను జితేందర్ రెడ్డి ఆశించారు. అయితే ఆ స్థానాన్ని డీకే అరుణకు ఇచ్చారు. అసంతృప్తికి గురైన జితేందర్ రెడ్డితో కాంగ్రెస్ నేతలతో చర్చలు జరిపింది. ప్రస్తుతం మల్కాజిగిరి కోసం బలమైన అభ్యర్థి కోసం కాంగ్రెస్ వెదుకుతోంది. జితేందర్ రెడ్డికి అక్కడ అవకాశం కల్పిస్తామని ఆఫర్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. 2019 ఎన్నికల సందర్భంగా జితేందర్ రెడ్డికి కేసీఆర్ టిక్కెట్ నిరాకరించారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయనకు టిక్కెట్ ఇవ్వకపోవడంతో బీజేపీలో చేరారు. అప్పటికి డీకే అరుణక బీజేపీ టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా డీకే అరుణ కోసం ప్రచారం చేశారు. స్వల్ప తేడాతో డీకే అరుణ పరాజయం పాలయ్యారు. అయితే ఆ తర్వాత ఎంపీ టిక్కెట్ కోసం ఇద్దరు నేతలు గట్టిగా ప్రయత్నించారు. ఒకరిని అసెంబ్లీకి పోటీ చేయించేందుకు హైకమాండ్ ప్రయత్నించింది. కానీ ఇద్దరూ పోటీ చేయలేదు. మహబూబ్ నగర్ అసెంబ్లీ స్థానం నుంచి జితేందర్ రెడ్డి కుమారుడికి చాన్సిచ్చారు. కానీ ఆయన ఘోరంగా ఓడిపోయారు. ఈ క్రమంలో ఎపీ టిక్కెట్ కోసం కూడా జితేందర్ రెడ్డి ప్రయత్నించారు. కానీ డీకే అరుణ గత ఎన్నికల్లో స్వల్ప తేడాతోనే పరాజయం పాలు కావడంతో ఆమెకే చాన్సివ్వాలని నిర్ణయించు కున్నారు. వరుసగా రెండోసారి ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉంటే రాజకీయ భవిష్యత్ గందరగోళంలో పడుతుందన్న ఉద్దేశంతో జితేందర్ రెడ్డి పోటీకి సిద్ధమయ్యారు. అయితే మహబూబ్ నగర్ స్థానం నుంచి ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థిగా వంశీచంద్ రెడ్డి ఉన్నారు. ఆయన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా కూడా ఉన్నారు. ఆయనను కాదని జితేందర్ రెడ్డికి టిక్కెట్ ఇచ్చే పరిస్థితి లేదు. అందుకే మల్కాజిగిరి స్థానం ఆయనకు ఆఫర్ చేసే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. చర్చలు కొలిక్కి రావడంతోనే రేవంత్ రెడ్డితో జితేందర్ రెడ్డి భేటీ అయ్యారని తెలుస్తోంది. మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీకి బలమైన అభ్యర్థి లేరు. అంత బలమైన నేతలుగా ప్రచారంలోకి రాలేదు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నాగర్‌కర్నూలు నేత మర్రి జనార్ధన్ రెడ్డి మల్కాజిగిరి నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపారు. అయితే.. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు పెద్దగా ఆసక్తి చూపించలేదు. ప్రత్యామ్నాయంగా జితేందర్ రెడ్డిని ఒప్పించినట్లుగా తెలుస్తోంది. బీఆర్ఎస్ తరపున శంభీపూర్ రాజు పోటీ చేయనున్నారు. జితేందర్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మల్కాజిగిరిలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్లుగా పోరు సాగే అవకాశం ఉంది.

## కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా మరో ఇద్దరు
### ప్రధాని మోడీ అధ్యక్షతన భేటీలో ఆమోదం
### జ్ఞానేష్ కుమార్, బల్వీందర్ సంధుల నియామకం



న్యూఢిల్లీ,మార్చి14: భారత ఎన్నికల సంఘం కొత్త ఎన్నికల కమిషనర్లుగా జ్ఞానేష్ కుమార్, బల్వీందర్ సంధులను ఎన్నికల సంఘం నియమించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కమిటీతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఎన్నికల కమిషనర్ పదవికి అరుణ్ గోయల్ రాజీనామా చేయడం, అనుప్ చంద్ర పాండే పదవీ విరమణ కారణంగా ఈ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు ఆ పోస్టులు భర్తీ అయ్యాయి. కేంద్ర ఎన్నికల సంఘంలో ఖాళీ అయిన కమిషనర్ల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ గురువారం సమావేశమైంది. కొత్త ఎన్నికల కమిషనర్ల ఎంపికపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రాకముందే.. కమిటీ సభ్యుల్లో ఒకరైన కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధరీ పేర్లను బయటపెట్టారు. ఈసీలుగా మాజీ అధికారులు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, జ్ఞానేశ్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు మీడియాకు వెల్లడించారు. నూతన ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, హోంశాఖ కార్యదర్శి, సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్న సెర్చ్ కమిటీ ప్రతిపాదిత పేర్లతో జాబితాను రూపొందించింది. అనంతరం మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ సమావేశమై దీనిపై చర్చించింది. ఇందులో అధిర్‌తో పాటు కేంద్రహోం మంత్రి అమిత్ షా సభ్యులుగా ఉన్నారు. ఈ భేటీ అనంతరం అధిర్ మీడియాతో మాట్లాడుతూ.. 'కమిటీలో ప్రభుత్వానికే మెజార్టీ ఉంది. తొలుత నాకు 212 పేర్లను పంపించారు సమావేశానికి 10 నిమిషాల ముందు ఆరుగురు పేర్లను చెప్పారు. చివరకు పంజాబ్‌కు చెందిన సంధూ, కేరళకు చెందిన జ్ఞానేశ్‌ను ఎంపిక చేశారు. ఇది ఏకపక్షమని నేను చెప్పను. కాకపోతే ఈసీల ఎంపికకు అనుసరిస్తున్న పక్రియలో లోపాలున్నాయి. ఎంపిక కమిటీలో సీజేఐ సభ్యులుగా ఉండాలి' అని ఆయన పేర్కొన్నారు. గత నెల ఒక కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేశారు. ఇటీవల మరో కమిషనర్ అరుణ్ గోయెల్ అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో ఎన్నికల సంఘంలో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ఇదిలా ఉండగా.. 'కేంద్ర ఎన్నికల కమిషనర్' (సీఈసీ), 'ఎన్నికల కమిషనర్' (ఈసీ)ల నియామక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని మినహాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరపనుంది.

## చేతిలో చిల్లిగవ్వ లేదు
### బీజేపీపై మల్లిఖార్జున ఖర్గే ఆరోపణలు

బెంగళూరు, మార్చి 14లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌కి పెద్ద చిక్కు వచ్చి పడింది. ప్రచారం కోసం ఖర్చు పెట్టేందుకు ఒక్క రూపాయి కూడా లేదని ఆ పార్టీ వాపోతోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్వయంగా ఈ విషయం వెల్లడించారు. పార్టీకి సంబంధించిన అన్ని బ్యాంక్ ఖాతాల్నీ బీజేపీ ఫ్రీజ్ చేయించిందని ఆరోపించారు. ఐటీ డిపార్ట్‌మెంట్ కావాలనే తమ బ్యాంక్ అకౌంట్స్‌ని నిలిపివేసిందని మండి పడ్డారు. భారీ జరిమానాలు చెల్లించాలని నోటీసులు పంపారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీని టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించిన ఖర్గే...వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌ని గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కు అన్ని పార్టీలకూ ఉంటుందని, కానీ బీజేపీ కుట్రపూరితంగా తమ బ్యాంక్ అకౌంట్స్‌ని ఫ్రీజ్ చేయించిందని,



ఇన్‌కమ్ ట్యాక్స్ పేరు చెప్పి ఇబ్బందులకు గురి చేస్తోందని అసహనం వ్యక్తం చేశారు. ఎలక్టోరల్ బాండ్స్ విషయంలో జరిగిన అవకతవకల్ని బయట పెట్టే ధైర్యం లేని బీజేపీ తమని మాత్రం ఇలా ఇబ్బంది పెడుతోందని ఫైర్ అయ్యారు. "మాకు వచ్చిన ప్రతి రూపాయి ప్రజలు ఇచ్చిందే. విరాళాల రూపంలో మాకు వచ్చిన డబ్బే అదంతా. కానీ బీజేపీ ఆ నిధుల్ని పూర్తిగా నిలిపివేసింది. ఇప్పుడు ఖర్చు పెట్టడానికి మా దగ్గర ఒక్క రూపాయి కూడా లేదు. అటు బీజేపీ మాత్రం ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా ఎంత మొత్తంలో విరాళాలు వచ్చాయో చెప్పడానికి వెనకడుగు వేస్తోంది. వాళ్ల మోసాలు బయట పడతాయని భయపడుతోంది. అందుకే జులై వరకూ సమయం కావాలని రిక్వెస్ట్ పెట్టుకున్నారు"

– మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

గతంలో చేసిన తప్పులే మళ్లీ చేయొద్దని, కాంగ్రెస్‌ని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు ఖర్గే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కలబురగి నుంచి పోటీ చేసిన మల్లికార్జున్ ఖర్గే బీజేపీ అభ్యర్థి ఉమేశ్ జాదవ్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ సారి ఇక్కడి ప్రజలు తప్పకుండా కాంగ్రెస్ అభ్యర్థినే గెలిపించాలని కోరారు. ఈ సారి ఎన్నికల్లో మల్లికార్జున్ ఖర్గే పోటీ చేసే అవకాశాలు తక్కువే కనిపిస్తున్నాయి. "ఈసారి కూడా మోసపోకండి. బీజేపీ వాళ్లంతా మోసగాళ్లే. అబద్ధాలు చెబుతారు. నిజాలు దాచిపెట్టి అబద్ధాలనే వ్యాప్తి చేస్తారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రజలంతా ఒక్కటిగా ఉండాలని అంబేద్కర్ చెప్పారు. రాజ్యాంగమే లేకపోతే ఈ దేశంలో స్వేచ్ఛ అనేదే ఉండదు"

– మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

మహిళలను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీ..పలు రాష్ట్రాల్లో ఇదే వ్యూహంతో అధికారంలోకి వచ్చింది. తెలంగాణలోనూ ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం పేరుతో మెజారిటీ మహిళల అభిమానం పొందింది.

## సీఏఏను ఎన్నటికీ వెనక్కి తీసుకోబోం.. అమిత్ షా స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మార్చి 14: సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రతిపక్ష కాంగ్రెస్ సహా తృణమూల్, సీపీఐ, ఆప్, సమాజ్‌వాదీ, డీఎంకే తదితర పార్టీలు ఈ చట్టాన్ని ఇప్పటికే వ్యతిరేకించాయి. తమ రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమలు చేయబోమని స్పష్టం చేస్తున్నాయి. ఈ చట్టాన్ని




కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్లు కూడా వెల్లువెత్తున్నాయి. పలువురు ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో సీఏఏ అంశంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా (ంఎతిబి ాష్ట్రజీష్ట్ర) తాజాగా స్పందించారు. సీఏఏను ఎప్పటికీ వెనక్కి తీసుకోబోమని స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం ఏ దేశ ముస్లింలైనా భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఇప్పుడు తీసుకొచ్చిన చట్టం మాత్రం విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో మతపరమైన హింసను ఎదుర్కొంటూ భారతదేశానికి రావాలని నిర్ణయించుకున్న ముస్లిమేతర మైనారిటీల కోసం ఉద్దేశించినదని షా వెల్లడించారు. ఇదే సందర్భంలో విపక్షాలపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాలకు ఏ పనీ లేదని అన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్‌ను కూడా స్వార్థ రాజకీయాల కోసం చేసినట్లు వారు విమర్శిస్తుంటారని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోకూడదా..? అని షా ప్రశ్నించారు. ఆర్టికల్ 370 రద్దును కూడా రాజకీయ లబ్ధి కోసం చేసినట్లు ప్రతిపక్షాలు పేర్కొన్నాయని అమిత్ షా మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే చట్టాన్ని ఉపసంహరిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని అన్నారు. వారు ఎన్నటికీ అధికారంలోకి రాలేరని, మోదీ సర్కారు తీసుకొచ్చిన ఈ చట్టాన్ని రద్దు చేయడం అసాధ్యమని షా పేర్కొన్నారు. భారత పౌరసత్వం కోసం అందరికీ తలుపులు తెరిచే ఉన్నాయని ఈ సందర్భంగా అమిత్ షా పేర్కొన్నారు. సీఏఏ రాజ్యాంగ విరుద్ధమని విపక్షాలు చేస్తున్న వాదనలో వాస్తవం లేదన్నారు. అది ఆర్టికల్ 14కు ఎలాంటి భంగం కలిగించదని వెల్లడించారు. ఈ చట్టంపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. నాలుగేండ్ల కిందట ఆమోదం పొందిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం-2019 (సీఏఏ)ను తాజాగా అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

## రాష్ట్రపతి ముర్ముకు చేరిన జమిలి వివరాలు
### 18,629 పేజీల నివేదిక అందచేసిన కోవింద్
### 190 రోజుల పాటు వివిధ వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ
### రాష్ట్రపతిని కలిసి నేవదిక అందించిన రామ్‌నాథ్ కోవింద్



న్యూఢిల్లీ,మార్చి14(: సమిలి ఎన్నికలపై అధ్యయనం జరిపిన కోవింద్ కమిటీ తన నివేదికను రాష్ట్రపతి ద్ంరౌపది ముర్ముకు అందచేసింది. ఒకే దేశం.. ఒకే ఎన్నికలు పేరిట దేశంలో అన్నిరకాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే ప్రతిపాదనపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ అధ్యయనం జరిపింది. ఈ నివేదికను గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సమర్పించింది. గురువారం ఉదయం కోవింద్ సహా కమిటీ సభ్యులు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. జమిలి ఎన్నికలపై 18,629 పేజీల నివేదికను ప్రథమ పౌరురాలికి అందజేశారు. దాదాపు 190 రోజుల పాటు ఈ అంశంపై కమిటీ అధ్యయనం జరిపింది. పలు రంగాల నిపుణులతో విస్తృత సమావేశాలు నిర్వహించింది. ప్రజల నుంచి కూడా సలహాలు, సూచనలు స్వీకరించింది. అనంతరం నివేదికను రూపొందించింది. లోక్‌సభ, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించాలంటే రాజ్యాంగంలో కనీసం ఐదు ఆర్టికల్స్‌ను సవరించాలని కమిటీ తమ నివేదికలో సూచించినట్లు తెలుస్తోంది. మూడుస్థాయిల ఎన్నికలకు ఉమ్మడిగా ఓటర్ల జాబితా ఉండాలని అందులో పేర్కొన్నట్లు సమాచారం.

## ఏక్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్
### కసరత్తు చేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ,మార్చి14: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు సమయం ఆసన్నమైంది. భారత ఎన్నికల సంఘం ఒకటి రెండు రోజుల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నోటిఫికేషన్ వివరాలు ప్రకటించే అవకాశం ఉందంటూ జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. నేడో, రేపో షెడ్యూల్ ప్రకటించవచ్చని పేర్కొంటున్నాయి. ప్రకటన తేదీల్లో మార్పు ఏమైనా ఉన్నా ఈ వారంలో షెడ్యూల్ విడుదల కావడం ఖాయమంటూ రిపోర్టులు పేర్కొంటున్నాయి. కాగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కూడా వెలువడనుంది. జమ్ముకాశ్మీర్‌లో ఎన్నికల సన్నద్ధతపై ఎన్నికల సంఘం బృందం పరిశీలన అనంతరం నోటిఫికేషన్ వెలువడాల్సి ఉందని, అయితే ఎన్నికల సంఘం బుధవారం జమ్ముకాశ్మీర్‌లో పర్యటించడంతో ఇక నోటిఫికేషన్ వెలువడడమే తరువాయి అని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. కాగా సెప్టెంబర్ 30, 2024లోగా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి, రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు గతేడాది కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం బృందం బుధవారం అక్కడ పర్యటించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. భద్రతా పరిస్థితిని సమీక్షించిన అనంతరం జమ్మూ కాశ్మీర్‌లో లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలా? లేక వేర్వేరుగా నిర్వహించాలా? అనే దానిపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ రావు మృతి
### నివాళి అర్పించిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

హైదరాబాద్,మార్చి14: ఉమ్మడి వరంగల్ జిల్లా చెన్నూరు మాజీ శాసనసభ్యులు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మాజీ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్ రావు మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో ఉన్న పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. గత కొన్నాళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం వడ్డే కొత్తపల్లిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, ఎండోక్రైనాలజిస్ట్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు స్వస్థలం మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని వడ్డేకొత్తపల్లి. 1974 లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆయన 1984లో డీఎం పట్టా అందుకున్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఉద్యోగం ప్రారంభించి, గాంధీ మెడికల్ కాలేజీలో ఎండోక్రైనాలజీ విభాగం అధిపతిగా 1999లో రిటైర్ అయ్యారు. ఆ తర్వాత పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో వివిధ హోదాల్లో కొనసాగి వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 8 పరిశోధన పత్రాలను ప్రచురించారు. జాతీయ, అంతర్జాతీయ వైద్యుల సొసైటీల్లో సభ్యుడిగా ఉన్న ఆయనకు 2014లో ఎండోక్రైనాలజీ విభాగంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు, 2016లో డయాబెటిక్ విభాగంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు వరించాయి. సుధాకర్‌రావు తండ్రి యతిరాజారావు ఉమ్మడి ఏపీలో ఏడుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. యతిరాజారావు మంత్రిగా కూడా పనిచేశారు. 1999 నుంచి 2003 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సుధాకర్ రావు అంచనాల కమిటీ సభ్యుడిగా, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్‌గా వ్యవహరించారు.

# శ్రీ ప్రస్థానం

సంపాదకీయం

## బెంగళూరులో నీటి సంక్షోభం

బోర్లు అడుగంటాయి. చెరువులు ఎండిపోయాయి. నదులు పిల్ల కాలువలను తలపిస్తున్నాయి. ఇప్పట్లో వర్షాలు కురిసే అవకాశం లేదు. ఉన్న భూగర్భ జలాలు రోజురోజుకు పడిపోతున్నాయి. ఇలాంటి సమయంలో అక్కడి ప్రభుత్వానికి ఏం చేయాలో అర్థం కావడం లేదు. తెరపైకి అనేక నిబంధనలు తీసుకొచ్చింది. వాటర్ సర్వీసింగ్ సెంటర్లను మూసివేసింది. నీళ్లను అడ్డగోలుగా వాడితే జరిమానా విధిస్తామని హెచ్చరించింది. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. తాగే నీటికి కటకట.. స్నానం వారానికి ఒక్కసారే.. ఇది ప్రస్తుతం దేశ ఐటీ రాజధాని బెంగళూరులో నెలకొన్న పరిస్థితి.మార్చి నెలలోనే బెంగళూరు వాసులు నీళ్ల కోసం ఆర్తనాదాలు పెడుతున్నారంటే.. ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. బోర్లు ఎండిపోవడంతో బెంగళూరులో నీటి సంక్షోభం తీవ్ర రూపు దాల్చింది. స్థానికులు అవసరాల కోసం ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే సమయంలో ట్యాంకర్ నిర్వాహకులు అడ్డగోలుగా చార్జీలు వసూలు చేస్తున్నారు. గతంలో ఒక ట్యాంకర్ 600 నుంచి 1000 వరకు లభ్యమయ్యేది. కానీ ఇప్పుడు ఆ ధర ఏకంగా రెండు వేలకు పెరిగిందంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ధరలు తగ్గించాలని హెచ్చరించడంతో ట్యాంకర్ నిర్వాహకులు నగరానికి రావడమే మానేశారు. దీంతో ప్రజలు అవసరాల కోసం ఆర్.ఓ ప్లాంట్ల మీద ఆధారపడుతున్నారు. అక్కడ కూడా ఒక్కొక్కరికి ఒక్కో క్యాన్ మాత్రమే ఇస్తున్నారు. ప్లాంట్ల వద్ద భారీగా క్యూ ఉండటంతో, నీటి కోసమే గంటలపాటు నిలబడాల్సి వస్తోందని బెంగళూరు నగరవాసులు అంటున్నారు. స్నానం చేయడానికి, వంట చేసుకోవడానికి తగినంత నీరు కూడా లభించడం లేదని వారు వాపోతున్నారు. వంట చేసుకోవడానికి కార్పొరేషన్ నీటిని కాచి, వడపోసి వినియోగిస్తున్నామని చెబుతున్నారు.. గత మూడు నెలలుగా తాము ఈ ఇబ్బంది పడుతున్నామని.. బెంగళూరు నీటి సరఫరా, సీవరేజ్ బోర్డు (బీఎం డబ్ల్యూ ఎస్ఎస్ బీ) అధికారులకు ఫోన్ చేసిన పట్టించుకోవడంలేదని అంటున్నారు.. నీటి కరువు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో నన్ను వైట్ ఫీల్డ్ లోని ఓ హౌసింగ్ సొసైటీ కఠిన నిర్ణయం తీసుకుంది.. నీటి వినియోగాన్ని 20% తగ్గించకుంటే 5000 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించింది.తాగునీటి కరువు నేపథ్యంలో.. ప్రైవేటు వాటర్ ట్యాంకర్లను స్వాధీనం చేసుకుంటామని ఉప ముఖ్యమంత్రి శివకుమార్ హెచ్చరించారు.. సమస్య పరిష్కారానికి అన్ని వాటర్ ట్యాంకులు తమ వివరాలను బెంగళూరు నగరపాలక కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. లలో ఐదు రోజులు మాత్రమే స్నానం.. వంట చేయడానికి కూడా నీరులేక ఆన్‌లైన్ ఆర్డర్ చేసుకుని కడుపు నింపుకుంటున్నారు. ఇక త్రాగేతర పనుల కోసం శుద్ధి చేసిన నీటిని ఎంతో పొదుపుగా వాడుకుంటున్నారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాజధాని బెంగళూరు నగర ప్రజల నీటి కష్టాలు ఇవి. అక్కడి నీటి సంక్షోభం తారా స్థాయికి చేరింది. గుక్కెడు తాగు నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల బోర్లు ఎండిపోవడంతో నగరంలో ఈ పరిస్థితి నెలకొంది. స్కూళ్లలో విద్యార్థులకు తాగడానికి కూడా నీరు దొరకని దుస్థితి ఏర్పడిందంటే.. అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నీటి కొరత వల్ల పాఠశాలలను మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పాఠశాలలు ఇప్పటికే ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నాయి. మరోవైపు నగర జలమండలి కూడా సరిపడా నీటిని సరఫరా చేయకపోవడంతో.. ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. డిమాండ్ పెరగడంలో ట్యాంకర్ల ధరలు అమాంతం పెంచేశారు.కొన్ని ప్రాంతాల్లో గత రెండు నెలలుగా ప్రజలు నీళ్ల కోసం నీటి ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. మరోవైపు ఎండాకాలం ప్రారంభం కాకముందే పరిస్థితి ఇలా ఉంటే.. మునుముందు రోజుల్లో పరిస్థితి ఇంకెలా ఉంటుందో అని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో నగరంలో రోజుకు 2,600 నుంచి 2,800 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి అవసరం ఉంటే కేవలం 1,300 ఎంఎల్‌డీ నీరు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అంటే, అవసరమైన నీటిలో సగం కూడా సరఫరా జరగడం లేదు. దీంతో నీళ్ల ట్యాంకర్లు వచ్చినా సరిపోవడం లేదంటూ వాపోతున్నారు. నీటి కష్టాలు ఎప్పటికి తీరతాయో.. తమకు సాధారణ రోజులు ఎప్పటికి వస్తాయోనని తలలుపట్టుకుం టున్నారు.మళ్లీ వర్షాలు పడితే తప్ప పరిస్థితి మామూలు స్థితికి వచ్చేలా కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ క్రమంలో పాలకుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు రోడ్లు, అపార్ట్‌మెంట్లపై మాత్రమే దృష్టి పెడుతున్నారు. భూగర్భ జలాలలపై ఎన్నడైనా కృషి చేశారా? ఇలాంటి చర్యలు ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారువారందరితో సమావేశమయ్యారు? మరోవైపు నీటి కొరతను నివారించేందుకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసింది. కాగా, రాష్ట్రంలోని 236 తాలూకాల్లో 219 తాలూకాలు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నాయని ప్రభుత్వం ఇటీవల నివేదికలో పేర్కొంది.

## ముగుస్తోన్న టీఎస్పీయస్సీ గ్రూప్ 1 ఆన్‌లైన్ దరఖాస్తు గడువు..

హైదరాబాద్, మార్చి 14: తెలంగాణ ప్రభుత్వ విభాగాల్లో 563 గ్రూప్-1 సర్వీసు పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు నేటితో (మార్చి 14)తో ముగుస్తోంది. గురువారం సాయంత్రం 5 గంటలతో అప్లికేషన్ విండో క్లోజ్ అవనుంది.దీంతో ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ రోజు గ్రూప్ 1 అప్లికేషన్‌లకి చివరి రోజని, అర్హులైన ప్రతి ఒక్కరూ అప్లై చేసుకోవాలని సూచించారు. ఇంతకు ముందు అప్లై చేసిన వారు ఎలాంటి రుసుము లేకుండా మరోసారి అప్లికేషన్ నింపాలని ఆయన కోరారు.టీఎస్పీయస్సీ గ్రూప్ 1 పోస్టుల భర్తీకి తెలంగాణ సర్కార్ ఫిబ్రవరి 19వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించిన కమిషన్ మార్చి 14 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో డువు విధించింది. గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మరోసారి దరఖాస్తు చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. కొత్తగా విద్యార్హత పొందిన అభ్యర్థులు కూడా గ్రూప్ 1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ సూచించింది. కాగా మార్చి 13వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 2.70 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. 2022 ఏప్రిల్‌లో గత ప్రభుత్వం జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు 3.80 లక్షల మంది అప్లై చేసుకున్నారు. అయితే చివరిరోజున భారీ సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈసారి కూడా అలాగే జరగవచ్చని టీఎస్‌పీఎస్సీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక ఇప్పటికే గ్రూప్ 1 పరీక్ష రెండు సార్లు రద్దు కావడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఒకసారి పేపర్ లీకేజీ, మరోసారి నిబంధనలు సరిగా



పాటించలేదని ప్రిలిమ్స్ పరీక్షను కోర్టు రద్దు చేసింది.ఇటీవల రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం గతంలో ఇచ్చిన 503 పోస్టులకు మరో 60 పోస్టులను కలిపి ఫ్రెష్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో మొత్తం గ్రూప్ 1 పోస్టుల సంఖ్య 563కి చేరింది. ఇక ఇప్పటికే గ్రూప్ 1 పోస్టులకు ఆయా కేటగిరీల్లో సర్కార్ వయోపరిమితి పెంచింది కూడా. మార్చి 14వ తేదీ సాయంత్రం 5 గంటలకు తుది గడువు ముగుస్తోంది.

## దళిత, బహుజన విప్లవ నాయకుడు మాన్యశ్రీ కాన్షిరాం

**-ఫులే-అంబేద్కర్ ఆశయాల సాధన కొరకు తన జీవితాన్ని అంకితం చేసిన ధీశాలి**

**-నేడు ఆయన జయంతి**

దేశ రాజకియాలలో పెను మార్పులు తెచ్చి బహుజనులకు రాజ్యాధికారం కల్పించి భారత దేశ రాజకీయ చిత్ర పటాన్ని మార్చిన ఘనత మాన్యశ్రీ కాన్షి రాం కు దక్కుతుంది. మాన్య శ్రీ కాన్షి రాం చనిపొయి దశాబ్దం గడిచినది కాని బహుజన నాయుకుడిగా దేశ రాజకీయాలపై అతను ప్రసరించిన ప్రభావంను అతని అనుచరులు, సమర్ధకులు చివరికి అతని వ్యతిరేకులు కూడా విస్మరించ జాలరు.మాన్య శ్రీ కాన్షి రాం ఉత్తర భారత దేశం లో బహుజనులు-దళితుల, వెనుక బడిన, అణగారిన వర్గాల తిరుగు లేని నాయకుడు. అతడు తన జీవీతాంతం పై వర్గాల రాజకీయ అధికార ప్రాప్తి కోసం రాజి లేని పోరాటం సాగించినాడు. చిన్న తనం నుండి సమాజ మార్పు కోసం, రాజకీయాలలో అధికార మార్పు కోసం కంకణం దాల్చినాడు. సైకిల్ పై విస్తృతం గా దేశ వ్యాప్తం గా పర్యటించి బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయం ను ప్రచారం చేసి దళితులకు రాజకియ అదికారం కోసం పాటు పడినాడు. కాన్షి రామ్ మొదట్లో డీఎస్4, బీఏయంసిఈఎఫ్ తరువాత బహుజన సమాజ పార్టి ని స్థాపించినాడు. ఆతరువాత బహేన్ మాయావతి దానికి నాయకత్వం వహించి ఉత్తర ప్రదేశ్ కుల రాజకీయాలను కూకటి వేళ్ళతో ద్వంసం చేసి ముఖ్య మంత్రి అయినది. పంజాబ్ లో జన్మించిన శ్రీ కాన్షి రాం ఉత్తర ప్రదేశ్ ను తన రాజకీయ కేంద్రం గా నిర్ణయినీచుకొన్నారు. ఇతర దళిత నాయకుల వలే కాంగ్రెస్ మరి ఎ ఇతర రాజకీయ పక్షానికి దాసోహం అనలేదు. సంపద, వివాహం, ఇంటిని విడిచి ఫులే-అంబేద్కర్ ఆశయాల సాధన కొరకు తన జీవితం ను అంకితం చేసిన ధీశాలి శ్రీ కాన్షి రాం . దళితులకు శతాబ్దాల వారిగా జరుగుతున్న అన్యాయం, అసమానతల పట్ల శ్రీ కాన్షిరాం తన అసంతృప్తిని, బాధ ను ఆక్రోశం వేల్లుబుచ్చారు. తిలక్,తరాజు ఔర్ తల్వార్ కో మారో అనే నినాదం అగ్రవర్ణాల వారిని కోపానికి గురిచేసింది. కాని కాన్షి రామ్ తన ప్రచారం చేత బహుజన సమాజ్ పార్టి ని దేశ ప్రధాన రాజకీయ పక్షం గా నిలబెట్టారు. మొదట్లో సమాజ్ వాది పార్టి తో పిదప కాంగ్రెస్ తో జత కట్టి బ.స.పా ఉత్తర ప్రదేశ్ లో దళితుల పాలిటి అతి ముఖ్యమైన రాజకీయ పార్టి గా అవతరించినది. ముస్లిం ల సమర్ధన కుడా పొందినది. కుల రాజకీయాలు ఎక్కువగా ఉన్న సామజిక అసమాన తలు అధికం గా గల ఉత్తర ప్రదేశ్ లో బ.స.పా. అధికారం లోకి రావడం తో దళితులకు రాజకీయ అధికారం లబించినది. అతని శిష్యురాలు బహెన్ మాయావతి యు.పి. లో రెండు సార్లు ముఖ్య మంత్రి పదవిని పొందినారు.బహుజన సమాజ్ పార్టీ నిర్మాత. రామదాసియా శిక్కు చమార్ కులస్తులైన తేల్సింగ్, బిషన్సింగ్ కౌర్ లకు .మార్చి 15, 1934 పంజాబ్ రాష్ట్రంలో రోపార్ జిల్లా కావాస్పూర్ గ్రామంలోజన్మించాడు. జ్యోతిరావుపూలే, ఛత్రపతి సాహు మహరాజ్, పెరియార్ ఇ.వి. రామస్వామి నాయకర్, నారాయణగురు, అంబేద్కర్ ల ప్రబోధాలను రాజ్యాధికారం వైపు నడిపి విజయాలు సాధించాడు. తన 31వ ఏటనే అంబేద్కర్ రచించిన 'కుల నిర్మూలన ' గ్రంథం ద్వారా ప్రేరేపితుడయ్యాడు. తన తల్లికి ముప్పై పేజీల ఉత్తరం రాస్తూ 'ఇక నుంచి నేను కుటుంబ బాంధవ్యాలను తెంచుకుంటున్నాను. నా కోసం మీరు వెతకవద్దు' అంటూ బయటికి వెళ్లి, చనిపోయే వరకు తిరిగి ఇంటికి వెళ్లలేదు. 1984 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించాడు. ఒక ఓటు-ఒక నోటు అనే నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్లి వారిచ్చే డబ్బుతోనే ప్రచారం చేశాడు. కులాన్ని నిర్మూలిద్దాం-బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాడు. నువ్వు 85 శాతం ఉ ండగా 15 శాతం మీద ఎందుకు ఆధారపడతావు? నడువు పార్లమెంటు, అసెంబ్లీకి నడువు. నీ కాళ్లమీద నీవే నడువు అంటూ బహుజనులను ఉ సిగొల్పాడు. ప్రభుత్వ భూమి అంటే ప్రజల భూమి. ప్రజల భూమి మీద ప్రజలకు హక్కులేదా? అనేవాడు. కులాన్ని కులంతోనే జయించాలని కులాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకున్నాడు. యూపిలోని చమార్లనే పునాదిగా చేసుకొని పంజాబ్, హర్యానా, ఢిల్లీ, కాశ్మీర్, బీహార్, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ లలో ఇతర కులాలను కలుపుకొని పార్టీని బలోపేతం చేశాడు. మాయావతిని ముఖ్యమంత్రిగా చేశాడు. 1984లో ప్రారంభమైన బిఎస్పి 1996 నాటికి జాతీయ పార్టీగా ఎదిగింది. 2006 అక్టోబరు 9న కాన్షీరాం మరణించారు. భారత దేశ దళిత చరిత్ర లో శ్రీ కాన్షి రామ్ బహుజనులకు రాజ్యాధికార సాధన లో సాధించిన విజయం మరుపు రానిది.

## సైదాపూర్ లో మంత్రి పొన్నం పర్యటన



కరీంగనర్,హుస్నాబాద్ నియోజకవర్గంలోని వెంకేపల్లి - సైదాపూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసారు. సైదా పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో 18 పనులకు 75 లక్షల విలువైన నిర్మాణాలకు శంఖు స్థాపన చేసారు. కిచెన్ షెడ్లు ,టాయిలెట్ల నిర్మాణం , ఓపెన్ జిమ్ తో పాటు పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ,జిల్లా ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.మంత్రి పొన్నం మాట్లాడుతూ సైదాపూర్ మండలంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాం. ఈ నియోజకవర్గం ప్రత్యేక ప్రాధాన్యత తో పనులు అన్ని పూర్తి చేస్తున్నాం. మీ అందరి ఆశీర్వచనం ఎమ్మెల్యే గా గెలిచా. పార్టీ లో సీనియర్ కావడం వల్ల మంత్రి ని అయ్యా. రాజకీయాలకు అతీతంగా ఎలాంటి ఇబ్బందులూ ఉన్న నాకు చెప్పవచ్చు. పార్టీ సీనియర్ ఎంతగా బిజీ గా ఉన్న నియోజకవర్గ సమస్యల పై ఏమి ఉన్న చెప్పవచ్చు. కరీంనగర్ లో ఉన్న మండలాల విషయంలో కూడా కలెక్టర్ పనులు చేపించాలి. వేసవి కాలం లో నీటి ఎద్దడి లేకుండా చేస్తాం. కాంగ్రెస్ రాగానే వర్షాలు రాకుండా కరువు కు కారణం కాంగ్రెస్ కాదు. సెప్టెంబర్ లో కాంగ్రెస్ అధికారంలో లేదు. నీళ్ల సమస్య ఊర్లలో రావద్దని అన్నారు.వాళ్ళు ఏమి అడిగిన చేయండి.. ఒక్క బిందె పట్టుకొని బయటకు వచ్చే సమస్య రావద్దు. నీళ్ల సమస్య రాకుండా నియోజకవర్గానికి 3.5 కోట్లు తీసుకొచ్చాం. నేను విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుండి పాఠశాలల సమస్యలు తెలుసు. కిచెన్ ,టాయిలెట్స్ పూర్తి చేయాలి. హుస్నాబాద్ లో ఉన్న ఏ పాఠశాల కి ఎం కావాలన్న పరిష్కరిస్త. విద్యా కు మా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. సాగు నీరు సమస్యను కూడా పరిష్కరిస్తం. వాటర్ ఫ్యుర్ ఫైడ్ ప్లాంట్ పెడతాం. ప్రతి గ్రామంలో వాటర్ ప్లాంట్స్ పూర్తి కావాలి.. సీఎస్ఆర్ ఫండ్స్ ,బలవికాస వారితో కూడా మాట్లాడం. మీరు ఈ నియోజకవర్గం పోయిన మీ గౌరవం పెంచుతా అని చెప్పా. ఇప్పుడు ఎక్కడున్నా మీ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ అని చెబుతారు. విద్యార్థి నాయకుడు నుండి కష్టపడుతున్న. ఆసుపత్రి నుండి హైదరాబాద్ లో మనిషిని పెట్టినా. వాళ్ళు ఎలాంటి ఆసుపత్రి ప్రాబ్లమ్స్ ఉన్న సాల్వ్ చేస్తారు. గత ప్రభుత్వం లాగా కేంద్రంతో కోట్లా డే వాళ్ళం కాదు..వాళ్ల దగ్గర నిధులు తీసుకొస్తాం. ఫెడరల్ సిస్టంలో రాష్ట్రంలో కేంద్రం సహకరించాల్సిందే. ప్రజా సమస్యలపై కిందికి దిగి మీ సమస్యలు పరిష్కరిస్తా. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పాఠశాలల మరమత్తులు పూర్తి చేయాలి. ఆర్టీసి లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం ,ఇందిరమ్మ ఇళ్లు ,500 కే గ్యాస్ ,200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. నిన్న ఒక నేత ఆర్రెడీ ఉన్న కులాల కార్పోరేషన్ ల కోసం ధర్నా చేశారు..ముందు ఆయన తెలుసుకోవాలి. ఎక్కడెక్కడ బస్సులు లేవో అక్కడ సమస్య పరిష్కరిస్తానని అన్నారు.

## జోగులాంబ ఆలయంలో బిఆర్ఎస్ నేతల పూజలు

జోగులాంబ గద్వాల,మార్చి14(: అలంపూర్ పట్టణ కేంద్రంలోని శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి గురువారం దర్శించు కున్నారు. అర్చకులు వారిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వారిని శేష వస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట బీఆర్ఎస్ స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## సంగీత స్వరఝరి..మహాదేవన్

**నేడు ఆయన జయంతి**

చెన్నై,మార్చి14: కె.వి.మహదేవన్ గారి పూర్తి పేరు కృష్ణన్‌కోయిల్ వెంకటాచలం భాగవతార్ మహాదేవన్ సుప్రసిద్ధ తెలుగు చలన చిత్ర సంగీత దర్శకుడు. మహదేవన్ గారు తమిళ, తెలుగు , మళయాళం మొదలైన బాషలలో సంగీత స్వరాలందించారు. మహాదేవన్ 1917లో మార్చి 14న తమిళనాడులోని నాగర్‌కోయిల్‌లో లక్ష్మీ అమ్మాళ్, వెంకటాచలం అయ్యర్ (భాగవతార్) లకు జన్మించాడు. తమిళ అయ్యర్ కుటుంబానికి చెందిన మహాదేవన్ తండ్రి వెంకటాచలం భాగవతార్ గోటు వాద్యంలో నిష్ణాతుడు. వాళ్ల కుటుంబమంతా సంగీతమయమే. మహాదేవన్ తాతగారు తిరువాన్కూరు సంస్థానంలో సంగీత విద్వాంసునిగా పని చేసేవారు. నాలుగేళ్ల ప్రాయంలోనే చిన్నారి మహాదేవన్ నాదస్వర వాద్యానికి ఆకర్షితుడై నాదస్వర విద్వాన్ రాజరత్నం పిళ్ళై దగ్గర శిష్యరికం చేశాడు. అలాగే బూదంపాడి అరుణాచల కవిరాయర్ వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకొన్నారు. 'తిరుమంగై ఆళ్వార్' అనే తమిళ సినిమాలో జూనియర్ ఆర్టిస్ట్ గా నటించే అవకాశం లభించింది. చిత్రసీమ పరిశ్రమకి అంతులేని సేవలందించారు. 1952లో ఓ మలయాళీ కుర్రవాడు పరిచయం అయ్యాడు. చాలా కొద్ది కాలంలోనే మహాదేవన్ మనసు గెలుచుకున్నాడు. అతన్ని తన సహాయకునిగా పెట్టుకున్నారు. ఆ కుర్రవాడే పుహళేంది. ఈయన చివరి వరకు మహాదేవన్ తోనే పనిచేశారు. 1958 వ సంవత్సరంలో ప్రతిభా సంస్థ నిర్మించిన దొంగలున్నారు జాగ్రత్త అను సినిమాకు తొలిసారిగా తెలుగులో స్వరాలు అందించారు. అదే సంవత్సరంలో విడుదలైన ముందడుగు సినిమాతో మహాదేవన్ ప్రతిభ బయటపడింది. మామ వారసులెవ్వరూ సినీ రంగంలోకి రాలేదు. తనలాగ తన పిల్లలు కష్టపడకూడదనుకున్నారాయన. మామకు 82 ఏళ్లు దాటాక 'సహస్ర చంద్రదర్శనం' వేడుక చేశారు. అధిక మాసాలతో కలిపి వెయ్యి పున్నమి చంద్రులను చూసిన వారికి ఈ వేడుక చేస్తారు. తన కుటుంబ సభ్యుల సమక్షంలోనే ఈ వేడుక జరుపుకున్నారు.19వ శతాబ్దంలొ వచ్చిన సినిమాలన్నింటికి సంగీతమందించారు. 2001లొ మహదేవన్ గారు కాలంచేసారు.

## నేడు ప్రభుత్వ ఇఫ్తార్ విందు

**ఎల్‌బి స్టేడియంలో భారీగా ఏర్పాట్లు**

హైదరాబాద్,మార్చి14: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఈ నెల 15న తొలి శుక్రవారం నాడు నగరంలోని ఎల్బీ స్టేడియంలో ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఇవ్వనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. నిర్వహణ ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఇఫ్తార్ విందులో రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులంతా పాల్గొంటారని షబ్బీర్ అలీ తెలిపారు. ఆహ్వానితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. స్టేడియంలో నమాజ్ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఇఫ్తార్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ భోజన సదుపాయాలు అందుబాటులో ఉ ండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు, మొబైల్ మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

## 55 మార్కులకు తగ్గించండి...

**సింగరేణి ఉద్యోగాలు ఇప్పించండి.**

**మంత్రి శ్రీధర్ బాబును వేడుకున్న మైనింగ్ గ్రాడ్యుయేట్స్.**

కమాన్ పూర్,సింగరేణి జాబ్ ఎక్స్టర్నల్ నోటిఫికేషన్ లో మార్కుల శాతం 55% కు తగ్గించాలి అని మంత్రి శ్రీధర్ బాబు కు మైనింగ్ గ్రాడ్యుయేట్స్ వినతి పత్రం సమర్పించారు.బీటెక్ మైనింగ్ పూర్తి చేసి ఎన్నో రోజులుగా మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న మాకు మా అందరి గురించి ఆలోచించి సింగరేణి సంస్థ ద్వారా ఖాళీలను భర్తీ చేయుటకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది కానీ ఇటువల ఇచ్చిన నోటిఫికేషన్ నం .01/ 2024 లో మార్కుల శాతం 60% నిబంధన ఉండడం వల్ల మేము తీవ్రంగా నష్టపోతున్నాము .గతంలో సింగరేణిలో ఇచ్చిన నోటిఫికేషన్ 2010 సంవత్సరంలో నోటిఫికేషన్ నెంబర్ 4/2010, 2017లో ఇచ్చిన నోటిఫికేషన్ నెంబర్ 1/2017 సంవత్సరంలో ఇచ్చిన నోటిఫికేషన్ 5/ 2017 ద్వారా చేపట్టిన నియమకాల నోటిఫికేషన్లు 55 శాతం మార్కుల నిబంధన పెట్టడం జరిగింది. కానీ ఇప్పుడు ఎన్నో రోజులు ఎదురు చూస్తున్న మాకు గతంలో లాగా 55% మార్కుల నిబంధన కాకుండా 60% పెట్టడం వల్ల దాదాపు 250 మంది 2018 నుండి ఎదురుచూస్తూ సింగరేణిలోనే అన్ పేడ్ అప్రెంటిషిప్ ద్వారా బొగ్గు గనులలో పని చేస్తున్న మేము అవకాశాన్ని కోల్పోతున్నాం. కావున మా యందు దయతలచి సింగరేణి సి అండ్ ఎండి బలరాం తో మాట్లాడి గతంలో ఇచ్చిన విధంగా మార్కుల నిబంధనను 55% కు మార్చి పరీక్ష రాయడానికి అవకాశం కల్పించాలని, రాష్ట్ర ఐటి మరియు పరిశ్రమల శాఖ, అసెంబ్లీ వ్యవహారాలు మంత్రి వర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు గారిని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. సమస్య విని సానుకూలంగా స్పందించిన మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లోఏ ప్రదీప్, ఎం గణేష్ ,ఎస్ శ్రీకాంత్, డి రమేష్ ,యు ప్రశాంత్, టీ. మహేందర్,సిచ్.సాయి సుష్మత్, ఎం ప్రవీణ్ , జే.సుధాకర్ మరియు మాలాంటి వాళ్ళు ఇంకా చాలా మంది ఉన్నారు వారందరి తరుపున మాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాము.

## 18 ఓటీటీ చానెల్స్... బంద్

హైదరాబాద్, మార్చి 14కేంద్ర ప్రభుత్వం 18 ఒటి ప్లాట్‌ఫామ్స్‌పై నిషేధం విధించింది. అశ్లీల కంటెంట్‌ని ఎక్కువగా ప్రమోట్ చేస్తున్నందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేసింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌కి చెందిన 19 వెబ్‌సైట్‌లు, 10 యాప్స్, 57 సోషల్ మీడియా హ్యాండిల్స్‌ని బ్లాక్ చేస్తున్నట్టు వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఈ నిషేధం వర్తిస్తుందని తేల్చి చెప్పింది. చాలా రోజులుగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్లాట్‌ఫామ్స్‌కి హెచ్చరికలు జారీ చేసింది. అశ్లీల కంటెంట్‌ని తొలగించాలని ఆదేశించింది. అయినా స్పందించకపోవడం వల్ల ఇప్పుడు వేటు వేసింది. కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ మార్చి 12వ తేదీనే ఈ వేటు వేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 10 యాప్స్‌ని వెంటనే బ్లాక్ చేయాలని తేల్చి చెప్పారు. ఇందులో గూగుల్ ప్లే స్టోర్‌లో 7 యాప్స్, యాప్‌స్టోర్‌లో మూడు యాప్స్ ఉన్నాయి. ఎనిటనీతీఎజీబితినీని ౹వఇష్ట్రనీశ్రీనీణఎ ంఇబి, 2000లోని నిబంధనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం వెల్లడించింది. సంబంధింత శాఖ అధికారులతో పాటు మహిళా హక్కుల నిపుణులను సంప్రదించిన తరవాతే ఈ నిషేధం విధించింది.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ జన్మదిన వేడుకలు



నర్సాపూర్ ప్రతినిధి/పటాన్చెరు(శ్రీ ప్రస్థానం న్యూస్)సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరు నియోజకవర్గం చిట్కుల్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిట్కుల్ మాజీ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ పుట్టినరోజు సందర్భంగా తన నివాసంలో కలుసుకొని శుభాకాంక్షలు తెలిపిన హత్నూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్రె కృష్ణ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలం మధు ముదిరాజ్ ఎల్లవేళలా ప్రజల దీవెనలు పొందే నాయకుడని ప్రజల కష్టాలలో వెలుగు నింపే నాయకుడని ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని కోరుకుంటున్నాం అన్నారు.

ప్రజా నాయకుడు, ప్రజాసేవకుడు
కష్ట కాలంలో? సహాయకుడు,సేవకుడు
అన్నా అంటే నేను ఉన్నానంటూ..
నీలం మధు ముదిరాజ్




ఈ కార్యక్రమంలో రాజు ముదిరాజ్, మల్లేశం ముదిరాజ్, సిహెచ్ మొగులయ్య ముదిరాజ్, మాణిక్యం ముదిరాజ్, మనోహర్ గౌడ్, మంగలి నాగరాజు, శ్రీకాంత్, భాస్కర్, నవాబుపేట ఆంజనేయులు, నవాబుపేట్ మల్లేశం, కుమ్మరి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిబా పూలే మరియు సవిత్రిబాయి పూలే విగ్రహాలు ధ్వనీసం చేసిన దుండగులను వేంటనేఆరేస్టు చేయాలి...




శ్రీ ప్రస్థానం మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి : గద్దర్ అభిమానుల సంఘం డిమాండ్ టినంగా శిక్షించాలని సి.యల్. యాదగిరి అన్నారు.చిన్న కోడూరు పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న మహాత్మ జ్యోతిభా పూలే,సవిత్రిబాయి పూలే విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు కూల్చి వేయడనీ జరిగిందని గ్రామస్తు లు తెలియజేయడంజరిగింది. ఈ ఘటనపై పలువురు అను మానం వ్యక్తనీ చేస్తున్నారు.ఈ విదనీగా చేసిన వారిని వేంటనే అరేస్టు చేసి ప్రజల ముందు శిక్షించాలని అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటి , గద్దర్ అభిమానుల సంఘం డిమాండ్ చేస్తున్నాయి.పోలీసు స్టేషన్ ఎదుటనే ఈ ఘటన చోటు చేసుకోవడనీ పలు అను మానాలుకల్గుతున్నాయి.ఇది కులమతోన్మాదులు చేసారా? ఎస్సీ, ఎస్టి,బిసిలా వ్యతిరేక అగ్రవర్ణాలవారు చేసారా? అని అయోమయంగా ఉంది అని పై సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. ఏది ఏమైన దుండగులను కటినంగా శిక్షించాలని కోరుతున్నాయి. సి.యల్.యాద గిరి,ప్రదానకార్యదర్శి,అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటి, మరియు అద్యక్షులు గద్దర్ అభిమా నుల సంఘం.

## గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రోనాల్డ్ రోస నిమర్యాదపూర్వకంగా కలిసి..

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి..



శ్రీ ప్రస్థానంమల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రోనాల్డ్ రోన్ ని మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజ్గిరి నియోజకవర్గం నుండి వచ్చిన వినతి పత్రాలను కమిషనర్ కి అందజేసి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. అందుకు గాను కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ యొక్క కార్యక్రమంలో కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ , మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగరావు, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు



రావుల అంజయ్య, రాము యాదవ్, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, అనిల్ కిషోర్, ఇబ్రహీం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పదవ తరగతి వీడ్కోలు సమావేశం



టేక్మల్ శ్రీ ప్రసన్న ప్రతినిధి :-బొడ్మట్ పల్లి లో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల గురువారం 10 పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించుకోవడం జరిగింది.పదవ విద్యార్థులు చక్కటి సాంస్కృతిక కార్యక్రమాలు మరియు నృత్య ప్రదర్శనలతో , ఆటపాటలతో పాఠశాలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో ఆనందంగా పాల్గొన్నారు.పదవ తరగతి చదువు భవిష్యత్ కి పునాదిలాంటిది అని,మరింత చదువుకొని భవిష్యత్ లో మంచి స్థాయిలో రాణించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత అన్నారు.ఈ కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్ష హాల్ టికెట్స్ పంపిణీ చేయడం అయినది.మహిళ ఉపాధ్యాయులకు మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విచ్చయ్య,రాజేశ్వర్ ,,శివ శంకర్,ఇందిర,అర్చన,రాణి,రాధిక పాల్గొన్నారు.




# కొడుకు రాజకీయ ఎదుగుదలే లక్ష్యం

అమిత్ ప్రత్యక్ష రాజకీయాల కోసం గుత్తా ఎత్తులు

నల్గొండ,మార్చి14: జిల్లాలో సీనియర్ బిఆర్ఎస్ నేత,మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరోమారు వార్తల్లో నిలిచారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న ఆయన రాష్ట్ర రాజకీయాల్లో తన కుమారుడు అమిత్ ఎదుగుదలను చూసి ఆనందించాలని భావిస్తున్నారు. అందుకోసం ఎంపిగా నిలబెట్టే క్రమంలో రాజకీయ ఎత్తులు వేస్తున్నారు. ఇంతకాలం ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న గుత్తా ..ఇప్పుడు సైలెంట్‌గా ఉన్నారు. మండలి ఛైర్మన్ అన్నది అత్యున్నతపదవే అయినా రాజకీయంగా పెద్దగా ముందుకు సాగే ఛాన్స్ ఉండదు. మండలి చైర్మన్ కావడంతో జిల్లాలో రాజకీయంగా చక్రం తిప్పే స్థానం ఉండదు. దీనికితోడు గుత్తా సుఖేందర్ రెడ్డికి సొంత జిల్లాలోనే కొందరు పొగ పెడుతున్నారని ప్రచారం ఉంది.మండలి ఛైర్మన్‌గా రెండోసారి అవకాశం ఇచ్చినా...తన కొడుకును ఎంపిగా చూడాలన్న కోరికతో ఉన్నారు. ఈ క్రమంలో ఆయన తనయుడు ఇటీవలే సిఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో భేటీ అయ్యారు. భువనగిరి ఎంపి స్థానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి వివాద రహితుడిగా మృదు స్వభావి గా పేరుంది. వార్డు సభ్యుడిగా రాజకీయ అరంగ్రేటం చేసిన గుత్తా టీడీపీ నుంచి 1999లో నల్గొండ ఎంపీగా గెలిచి పార్లమెంట్లో అడుగు పెట్టారు. రాజకీయ సమీకరణాల్లో భాగంగా 2009లో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో నల్గొండ ఎంపీగా రెండోసారి విజయం సాధించారు. తిరిగి 2014లో వరుసగా మూడోసారి కాంగ్రెస్ ఎంపీగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. మారిన రాజకీయ సమీకరణాలతో తన అనుచరులతో కలిసి గుత్తా సుఖేందర్ రెడ్డి గులాబీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర స్థాయిలో సీఎం కేసీఆర్ ఏర్పాటుచేసిన రైతు సమన్వయ సమితి తొలి చైర్మన్ గా వ్యవహరించాడు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా నామినేట్ అయిన గుత్తా సుఖేందర్ రెడ్డి శాసన మండలి రెండో ఛైర్మెన్ గా 21 నెలలపాటు వ్యవహరించారు. ఆ పదవి నుంచి గుత్తా దిగిపోయిన నాటి నుంచి ఖాళీగానే ఉంది. తిరిగి రెండోసారి 2021 నవంబర్ లో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నిక య్యారు. అయితే కాంగ్రెస్ నుంచి టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నప్పటి నుంచి గుత్తా సుఖేందర్ రెడ్డి క్యాబినెట్ లో బెర్త్ ఆశించారు.

ఎప్పుడూ ప్రజాక్షేత్రంలో ఉండేందుకు ఇష్టపడే సుఖేందర్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీలో చేరిన తొలినాళ్లలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా ప్రభుత్వం నియమించింది. ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక 2019 సెప్టెంబర్ 11 నుంచి గతేడాది జూన్ 3వరకు మండలి చైర్మన్ గా పనిచేశారు. మరో మారు చైర్మన్ పదవి దక్కడంతో ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారనే భావించాలి. అయితే గతంలో గుత్తా శాసనమండలి చైర్మన్ అయినప్పటికీ ప్రజలతో, పార్టీ కేడర్ తో సత్సంబందాలు కొనసాగించారు. నాగార్జునసాగర్ ఉపఎన్నిక, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గుత్తా తెరవెనక పాత్ర పోషించారు. మండలి చైర్మన్ పదవిలో గుత్తా ఎన్నాళ్లు కొనసాగుతారనే విషయం పక్కన పెడితే భవిష్యత్తులో తన కుమారుడి రాజకీయ ఎదుగుదల కోసం ఆయన తాపత్రయ పడుతున్నారు. కొడుకును ఎంపిగా చేస్తే ఇక తనకు తిరుగుండదని భావిస్తున్నారు. కాంగ్రెస్‌లో టిక్కెట్ లభిస్తే గుత్తా కూడా ప్లేట్ ఫిరాయిస్తారని ప్రచారం ఉంది. అయితే అమిత్‌కు కాంగ్రెస్ టిక్కెట్ ఇస్తుందా అన్నది చూడాలి.

# పోటీకి దూరంగా కేసీఆర్ ఫ్యామిలీ



హైదరాబాద్, మార్చి 14 (న్యూస్ పల్స్):పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి త్వరలో ప్రకటన విడుదలయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే బీజేపీ మొదటి జాబితా అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ కూడా అదే పని చేసింది. భారత రాష్ట్ర సమితి ఐదు నుంచి ఆరు స్థానాలకు అభ్యర్థుల వివరాలు వెల్లడించింది.. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి, కాంగ్రెస్ కు అభ్యర్థుల కరువు లేదు. పైగా సీట్లలో పోటీ చేసేందుకు చాలామంది రెడీగా ఉన్నారు. 2019లో భారత రాష్ట్ర సమితికి కూడా ఇదే పరిస్థితి ఉండేది. కానీ 2023 ఎన్నికల్లో ఓడిపోవడంతో ఒక్కసారిగా తారుమారయింది. దీంతో ఆ పార్టీకి సంబంధించి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరనే ప్రచారం జరుగుతోంది.అభ్యర్థులు లేకపోయినప్పటికీ కెసిఆర్ వరుసగా సమీక్షలు చేస్తున్నారు. వివిధ జిల్లాలకు చెందిన నాయకులతో తెలంగాణ భవన్ లో భేటీ అవుతున్నారు. పలు విషయాలపై మాట్లాడుతున్నారు. అయితే కొన్ని స్థానాలకు సంబంధించి భారత రాష్ట్ర సమితి తరఫున ప్రకటించిన అభ్యర్థుల పేర్లను చూసి సొంత పార్టీ నాయకులే విస్మయం వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.. వారు కనీసం పోటీ ఇస్తారా అని కామెంట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది..మాల్కాజ్ గిరి పార్లమెంటు స్థానానికి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పేరును కేసీఆర్ ప్రకటించారు. వాస్తవానికి శంభీపూర్ రాజు ఇంతవరకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ పడలేదు. పైగా ఆయన ఎంపీ స్థాయి అభ్యర్థి ఎలా అవుతారని స్థానిక నాయకులు ప్రశ్నిస్తున్నారు. జహీరాబాద్ స్థానానికి గాలి అనిల్ కుమార్, చేవెళ్ల స్థానానికి కాసాని జ్ఞానేశ్వర్ పేర్లను కేసీఆర్ ఖరారు చేయడం పట్ల పై వ్యాఖ్యలే వ్యక్తమవుతున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పై రెండు స్థానాల్లో భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు విజయం సాధించారు.. ఇక్కడ వారికి లీడ్ కూడా ఎక్కువగానే వచ్చింది

## క్యూబిక్ మార్ట్ ను ప్రారంభించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్..

శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా ప్రతినిధి : మేడ్చల్ నియోజకవర్గం లోని ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వరంగల్ జాతీయ రహదారి ఉప్పల్ డిపో వద్ద క్యూబిక్ మార్ట్ ను టీపీసీసీ ఉపాధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీర్జాదిగూడ ఉప్పల్ డిపో ప్రాంతంలో వ్యాపార సంస్థలు వెలవడంతో అభివృద్ధి లో ముందుకు దూసుకపోతుందన్నారు.నమ్మకంతో వ్యాపారం చేసి కస్టమర్ల మన్ననలు పొందాలన్నారు.



## టేక్మాల్ నూతన ఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించిన బి.మురళి......

టేక్మల్ శ్రీ ప్రస్థానం ప్రతినిధి:-మెదక్ జిల్లా టేక్మాల్ మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై గా బి. మురళి గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన రమేష్ కు సీఐ ప్రమోషన్ మీద హైదరాబాద్ డిజిపి ఆఫీస్ పోలీస్ స్టేషన్ కి వెళ్లడం జరిగింది. నూతన ఎస్సై మురళి గతంలో కామారెడ్డి ఎస్సైగా పనిచేసి అక్కడి నుండి టేక్మాల్ కు బదిలీపై రావడం జరిగింది. ఎస్సై మురళి మాట్లాడుతూ టేక్మాల్ మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అసంఘిక కార్యక్రమాల, అక్రమ మద్యంపై దృష్టి సాధిస్తామన్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది నూతన ఎస్సై కి శుభాకాంక్షలు తెలియజేశారు




## పల్లెల్లో అభివృద్ధి ని పరుగు పెట్టిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ



టేక్మాల్ శ్రీ ప్రస్థానం ప్రతినిధి :-ప్రగతి పతం లో పల్లెలు లో భాగంగా ఈ రోజు కాదులూర్ లో ఎం జి ఎన్ ఆర్ ఇజి ఎస్ లో 10 లక్షల సి.సి రోడ్డు ,డ్రైన్స్ ప్రారంభించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ.రమేష్..కౌప్షన్ మెంబెర్ మాజర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తెలంగాణ వచ్చిన తర్వాత బి ఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాదులూరుకు ఒక పని చేయకుండా కాధ్లూరు సమస్యలు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ కూడా ఒక్క సమస్య కూడా తీర్చలేదు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి ఆధ్వర్యంలో టేక్మాల్ మండలం అభివృద్ధి లో పరుగులు పెడుతున్నది అన్నారు..ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ కీర్తి. టేక్మాల్ మాజి సర్పంచ్ పాపయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుర్గగౌడ్,భూమయ్య, బి, శంకర్. బక్క సిద్దు,ఎరుకల.శ్రీను, మెదబోయిన సత్తయ్య ,గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు...

## అశ్విత మరియు కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. చిల్డ్రన్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా క్యాంపెనింగ్ లో సవిత అనిల్ కిషోర్..






శ్రీ ప్రస్థానం మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి: అల్వాల్ జిహెచ్ఎంసి పరిధిలోని 135 డివిజన్ కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ అశ్విత మరియు కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న చిల్డ్రన్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా క్యాంపెనింగ్ లో భాగంగా చిల్డ్రన్ మ్యారేజ్ కి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయడం జరిగింది ఇందులో భాగంగా కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ మరియు అశ్విత సమస్త కమ్యూనిటీ సోషల్ వర్క అయినా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి నైబర్హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది....

ముఖ్య అతిథి:మర్రి రాజశేఖర్ రెడ్డి
మల్కాజిగిరి శాసనసభ్యులు.

శ్రీ ప్రస్థానం మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి : మల్కాజ్గిరి జిల్లా నేరేడ్మెట్ లోకేంద్ర ప్రభుత్వ క్రీడా మరియు యువజన మంత్రిత్వ శాఖలోని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నైబర్హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.స్థలం : మహాబోధి ఫంక్షన్ హాల్, జె.జె నగర్, నేరేడ్ మెట్ క్రాస్ రోడ్స్.తేది : 15/03/2024సమయం : ఉదయం 10 గంటలకు రేపు కేంద్ర ప్రభుత్వ క్రీడా మరియు యువజన మంత్రిత్వ శాఖలోని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నైబర్హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. కావున యువతి, యువకులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా మనవి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఎన్ వై కే స్ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది.ముఖ్య అతిథి : మర్రి రాజశేఖర్ రెడ్డి,మల్కాజిగిరి శాసనసభ్యులు. పాల్గొంటారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJETHA PRINTERS,H. NO: 46/801BHUDHAWARPETA, KURNOOL DIST,-518001, ANDHRA PRADESH, INDIA . PUBLISHED AT. H.NO 43/217A, NR PETA, KURNOOL DIST, ANDHRA PRADESH, INDIA. EDITOR PERUMALLA CHENNAKESHAVULU RNI NO: APTEL 2020/80757